సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 18 । ఫిబ్రవరి । 2025



ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి


ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. 8లో



వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆలయ కల్యాణమండపంలో నిత్యకల్యాణం వైభవంగా జరిగింది.

నేడు అష్టదళ పద్మారాధన



డాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

మావోయిస్టుల బంద్‌తో పోలీసుల అలెర్ట్



చింతూరు మండలం కూనవరం జంక్షన్ వద్ద వాహనాలను దారి మళ్లిస్తున్న పోలీసులు

చింతూరు: ఇటీవల ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌కు నిరసనగా మావోయిస్టులు మంగళవారం బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో సరిహద్దులో ఉన్న చింతూరు పోలీసులు అప్రమత్తమయ్యారు. వాహనాల తనిఖీలు ముమ్మరం చేయడంతో పాటు విస్తృతంగా సోదాలు నిర్వ హిస్తున్నారు. బంద్‌నేపథ్యంలో చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి మీదుగా తెలంగాణకు రాత్రిపూట వెళ్లే వాహనాలను కూనవరం మండలం భీమవరం మీదుగా దారి మళ్లించారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన అల్లిగూడెంకు ప్రతిరోజూ మండలంలోని వెళ్లే పాసింజ ర్ షటిల్ బస్సు సరీ్వసును రద్దుచేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని, సర్కిల్ పరిధి లోని రాజకీయ నాయకులకు నోటీసులు జారీచేసి, అప్రమత్తం చేసినట్టు సీఐ దుర్గాప్రసాద్ తెలిపారు.

మల్లుదొర వారసులకు ఇళ్లు ఇస్తాం

- కలెక్టర్ దినేష్ కుమార్


కొయ్యూరు: మల్లు దొర వారసులకు ఇళ్ల మంజూరు చేస్తామని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు.సోమవారం లంకవీధి వచ్చిన కలెక్టర్‌కు పలువురు వినతిపత్రాలు అందజేశారు. మల్లుదొర వారసులమైన తమకు ఇళ్లు ఇవ్వలేదని చంద్రమ్మ, కన్నమ్మలు కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లి, వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన కలెక్టర్ రెండు గృహాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. యూ.చీడిపాలెం నుంచి యర్రగొండ వరకు రహదారిని విస్తరించాలని సర్పంచ్ రమేష్ కోరగా సాధ్యం కాదని కలెక్టర్ స్పష్టం చేశారు. రహదారిని ప్రస్తుతం ఉన్న మూడున్నర మీటర్ల నుంచి ఆరు మీటర్లకు వెడల్పు చేస్తే అదనంగా అడవిని కోల్పోవలసి వస్తుందని. దీని వల్ల పనుల్లో జాప్యం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. లంకవీధి,తీగలమెట్ట, గాంకొండకు వెళ్లే మార్గంలో కల్వర్టు పూర్తిగా పాడైందని, కొత్తగా వంతెన నిర్మించాలని స్థానికులు కోరారు. స్పందించి కలెక్టర్ వంతెన నిర్మాణానికి ప్రతిపాదన పంపాలని పీఆర్‌జేఈ రామకృష్ణను ఆదేశించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం షిప్ బిల్డింగ్(సీఈఎంఎస్), విశాఖపట్నం పోర్టు అథారిటీ(వీపీఏ) సీఎస్‌ఆర్ నిధులతో నిరుద్యోగ యువతకు ఇన్వెంటరీ కంట్రోలర్, వెల్డింగ్ కోర్సుల్లో రెండు నెలల ఉచిత వసతితో కూడిన శిక్షణ ఇవ్వనున్నట్టు సీఈఎంఎస్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.సేతు మాధవన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 27ఏళ్లలోపు వయస్సు గల టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ వెల్డర్, ఫిట్టర్ ఉత్తీర్ణులైన యువతీ యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20వ తేదీ ఉదయం 9గంటలకు పాడేరు పోలీస్ స్టేషన్ గ్రౌండ్‌లో జరిగే శిబిరానికి విద్యార్హత, కుల ధ్రువీకరణ పత్రాలు, రేషన్, ఆధార్ కార్డు జెరాక్స్ కాపీలతో హాజరు కావాలని పేర్కొన్నారు. మరిన్ని పూర్తి వివరాలకు 8688411100, 8331901237, 0891- 2704010 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన చేయాలి

- డీఈవో బ్రహ్మాజీరావు



శారద నికేతన్ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

ముంచంగిపుట్టు: విద్యార్థుల స్థాయికి అనుగుణంగా ఉపాధ్యాయులు విద్యాబోధన చేయాలని డీఈవో పి.బ్రహ్మాజీరావు తెలిపారు. కిలగాడలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.పాఠశాల రికార్డులు, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి జవాబులు రాబట్టారు. పాఠ్యపుస్తకాలను చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ సెలవులు పెడుతున్న హెచ్‌ఎం నీలకంఠం స్థానంలో నూతనంగా భాస్కరరావును హెచ్‌ఎంగా నియమించినట్టు చెప్పారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అనంతరం ముంచంగిపుట్టులోని శారద నికేతన్ ఇంగ్లిషు మీడియం ప్రైవేట్ స్కూల్‌ను తనిఖీ చేశారు. పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుల విద్యార్హతలు,ఫీజుల వివరాలను ప్రిన్సిపాల్ మత్స్యరాజును అడిగి తెలుసుకున్నారు.అన్ని రకాల సౌకర్యాలతో పాఠశాల నిర్వహణ జరగాలని డీఈవో సూచించారు.

నల్లి పేసింది

- మిర్చి పైరుకు నల్లి తెగులు
- దిగుబడులు రాక వరుసగా నాలుగో ఏడాదీ నష్టాలే
- ఆందోళనలో రైతులు



నల్లి తెగులు ప్రభావంతో నల్లబడిన మిర్చి తోట

ఎటపాక: ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి తోటలను నల్లి తెగులు నలిపేసింది. వరసగా ఈఏడాదీ మిర్చి రైతులకు తీవ్ర నష్టాలను మిగిల్చింది. నాలుగేళ్ల నుంచి అనేక ఒడుదుడుకులు ఎదుర్కొంటూ మిర్చి పంటను సాగుచేస్తున్నా ఫలితం లేకుండా పోతోంది. ఎంతో ఆశతో సాగు చేసిన వాణిజ్య పంట మిర్చి ఈఏడాది కూడా రైతులతో కంటతడి పెట్టించింది. మొక్క నాటిన దగ్గర నుంచి కంటికి రెప్పలా కాపాడినా.. పూత, పిందె దశకు వచ్చేసరికి వాతావరణ మార్పులతో వైరస్, నల్లి తెగులు సోకి మొక్కలు నలుపు రంగులో మారి ఎండిపోయాయి. ఈ ఏడాది నాలుగు మండలాల్లో పోలవరం ముంపు భూములతో సహా ఆరు వేల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు.ఉద్యానవన శాఖ ఈ క్రాప్ లెక్కల ప్రకారం 2,600 ఎకరాల్లో మిర్చి సాగు చేసినట్టు గుర్తించారు.

దిగుబడులు,ధరలు పతనం

వరుసగా నాలుగో ఏడాది మిర్చి సాగులో దిగుబడులు తగ్గాయి. పండిన పంటకు గిట్టుబాటు ధరలేక రైతులు నష్టాల పాలయ్యారు.ఎకరా మిర్చి తోట సాగుకు సుమారు రూ.1.50 లక్షల వరకు పెట్టుబడులు పెట్టారు. ఎర్ర, నల్ల నల్లి తెగులు మిర్చి తోటలపై తీవ్ర ప్రభావం చూపడంతో వాటి నుంచి పంటను కాపాడుకునేందుకు ఎన్ని పురుగుమందులు పిచికారీ చేసినా ఫలితం లేకపోయింది. మిర్చి పూత,పిందె,ఆకుల్లోని రసాన్ని పీల్చివేయటంతో తోటలు నల్లగా మాడిపోయాయి. ఈఏడాది నెలరోజుల ఆలస్యంగా నల్లి ప్రభావం కనపడటంతో ముందుగా పండిన పంటే రైతుల చేతికందింది. ఎకరాకు 25నుంచి 30క్వింటాళ్ల వర కూ మిర్చి దిగుబడి రావలసి ఉండగా కేవలం ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల మాత్రమే దిగు బడి వచ్చింది. క్వింటా మిర్చి ధర బహిరంగ మార్కెట్లో ఈఏడాది రూ.13 వేలు మాత్రమే పలుకుతుండడంతో రైతులకు నష్టాలు తప్పడంలేదు. గతంలో క్వింటా ధర రూ.20 వరకు ఉండేది. పెట్టుబడులకు చేసిన అప్పులు కూడా తీరవని రైతులు ఆందోళన చెందుతున్నారు. చింతూరు మండలంలోని చూటూరు,కూటూరు,ఎటపాక మండలంలో నందిగామ,మురుమూరు, గౌరీదేవిపేట,గన్నవరం, నెల్లిపాక, తోటపల్లి, పిచుకలపాడు,రాయనపేట, గన్నవరం తదితర ప్రాంతాల్లో నల్లి ప్రభావం ఎక్కువగా ఉంది.నాలుగేళ్లుగా ఎర్ర,నల్ల నల్లి రైతులను వెంటాడుతుండటంతో వచ్చే ఏడాది మిర్చి సాగు ప్రశ్నార్థకమే.



రసం పీల్చటంతో పూత,పిందె లేని మిర్చి మొక్క

పురుగు మందుల పేరుతో దగా

రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు పురుగు మందుల దుకాణ దారులు రైతులను దగా చేస్తున్నారు. ఎర్ర,నల్ల నల్లి, ఇతర చీడపీడల నుంచి మిర్చి తోటలను కాపాడుకోవాలనే రైతుల తపన పురుగుమందుల దుకాణదారులకు కాసుల పంట పండిస్తోంది. దుకాణదారులను నమ్మి, వారు చెప్పిన అన్ని పురుగు మందులను అధిక ధరలకు కొనుగోలు చేసి పిచికారీ చేసినా ఫలితం ఉండటంలేదు. కొందరు డీలర్లు తెలంగాణ నుంచి తెచ్చిన మందులను ఈ ప్రాంత గిరిజన రైతులకు అధిక ధరలకు అంటగడుతున్నారు. పండిన కొద్ది పంట సొమ్ము డీలర్ల అప్పులు తీర్చేందుకే సరిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నష్టపోయాను



ఎంతో ఆశతో సాగుచేసిన మిర్చి ఈఏడాది కూడా నష్టాల ఊబిలోకి నెట్టింది. 8 ఎకరాల్లో మిర్చి సాగుకు చేస్తే దిగుబడి మాత్రం ఎకరాకు 10 క్వింటాళ్ల మాత్రమే వచ్చింది. ఇలాగే ఉంటే ఇక మిర్చి సాగు చేసే పరిస్థితి ఉండదు.

– దారా రమేష్, రైతు గౌరీదేవిపేట

ఎన్ని మందులు వాడినా ...



ఎర్ర, నల్ల నల్లి తెగుళ్ల నివారణకు ఎన్ని మందులు పిచికారీ చేసినా ఫలితం ఉండడం లేదు. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగు చేసిన మిర్చి చేతికందే సమయంలో నల్లి ప్రభావంతో నాశనమవుతోంది. వేల రూపాయలతో పురుగు మందులు కొని పిచాకారీ చేసినా కళ్లెదుటే తోటలు నల్లబడిపోతుంటే తట్టుకోలేకపోతున్నాం.

– యాలం సంతోష్, రైతు నందిగామ

సాగు విస్తీర్ణం తగ్గింది

ఎర్ర,నల్ల నల్లి ప్రభావంతో మిర్చి పంట దెబ్బతినడంతో దిగుబడులు తగ్గిపోతున్నాయి. దీంతో పంట వేసేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. ఈ ఏడాది సాగువిస్తీర్ణం గణనీయంగా తగ్గింది.కొంత ఆలస్యంగా మిర్చి తోటలను ఈఏడాది నల్లి ఆశించింది. దీని ప్రభావంతో దిగుబడులు తగ్గిపోతున్నాయి.

– ముత్తయ్య, హెచ్‌వో

ఖాళీ కవర్లపై సబ్ కలెక్టర్ ఆరా

- ఎంఎల్‌ఎస్ పాయింట్ సందర్శన
- రికార్డులు చూపడానికి తాత్సారం చేసిన జీసీసీ సిబ్బంది



అడ్డతీగల ఎంఎల్‌ఎస్ పాయింట్ వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ కల్పశ్రీ

అడ్డతీగల: కందిపప్పు ప్యాక్ చేసిన ఖాళీ కవర్ల వ్యవహారంపై రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ సోమవారం ఆరా తీశారు. అడ్డతీగల ఎంఎల్‌ఎస్ పాయింట్‌ని ఆమె సోమవారం సందర్శించారు.రికార్డులు చూపమని ఆదేశించినా చాలాసేపటి వరకు జీసీసీ సిబ్బంది రికార్డులు చూపకుండా తాత్సారం చేయడంతో అసహనం వ్యక్తం చేశారు. రికార్డులు తీసుకుని రంపచోడవరం వచ్చి కలవాలని అడ్డతీగల జీసీసీ బ్రాంచి ఇన్‌చార్జ్ మేనేజర్ విజయలక్ష్మిని, ఇతర సిబ్బందిని ఆదేశించారు.దీంతో జీసీసీ సిబ్బంది రికార్డులు తీసుకుని సోమవారం సాయంత్రం రంపచోడవరం వెళ్లారు. డి.భీమవరం రోడ్డులోని తుప్పల్లో పడి ఉన్న ఖాళీ కందిపప్పు కవర్లను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది పరిశీలించి, నివేదిక అందజేశారు.

318 ఖాళీ కవర్లు స్వాధీనం

అడ్డతీగల–డిభీమవరం రోడ్డు పక్కన తుప్పల్లో పడి ఉన్న 318 ఖాళీ కవర్లను సోమవారం స్వాధీనం చేసుకున్నట్టు అసిస్టెంట్ సివిల్ సప్లయిస్ అధికారి విజయభాస్కర్ తెలిపారు. రంపచోడవరం సబ్‌కలెక్టర్ కల్పశ్రీ ఆదేశాల మేరకు ఖాళీ కవర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో రికార్డులు పరిశీలించినట్టు తెలిపారు.సబ్‌కలెక్టర్ తదుపరి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

దొంగహామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార బ్రోచర్ చూపుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్

మాజీ ఎంపీ హర్షకుమార్

రంపచోడవరం: కూటమి ప్రభుత్వం దొంగ హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని మాజీ ఎంపీ జి.వి.హర్షకుమార్ ఆరోపించారు. ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న కుమారుడు జి.వి.సుందర్‌ను గెలిపించాలని ప్రచారం చేసేందుకు వచ్చిన ఆయన రంపచోడవరంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో కొంత మంది గిరిజనులతో మాట్లాడినప్పుడు వారు వై.ఎస్.జగన్ అంటే ఇష్టమే అని, కానీ కూటమి ప్రభుత్వానికి ఓటు వేశామని తెలిపారన్నారు. అమ్మ ఒడి పథకం ఇంటిలో ఒకరికే వస్తుందని, తల్లికి వందనం ఎంత మంది పిల్లలు ఉంటే అందరికీ వస్తుందని ఆశపడ్డారని తెలిపారు. ఇలాంటి ఎన్నో తప్పుడు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని చెప్పారు. తప్పుడు హామీలిచ్చిన కూటమి ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఖర్చు చేయాల్సిన సబ్ ప్లాన్ నిధులు ఏమవుతున్నాయో తెలియడం లేదన్నారు. రాజమహేంద్రవరం లాంటి ప్రాంతంలో కనీస వసతులు లేని హాస్టళ్లలో గిరిజన విద్యార్థులు మగ్గిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.హాస్టళ్ల సంఖ్యను పెంచడం లేదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏ భూమిపై కన్నుపడిందో గాని 1/70 చట్టాన్ని సవరిస్తామని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారని ఆరోపించారు.గిరిజనులు ఏకతాటిపై అల్టిమేటం జారీ చేయడంతో ప్రభుత్వం దిగివచ్చిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ వర్గీకరణ సమస్య లేదని, ఏజెన్సీ డీఎస్సీ ప్రకటించాలని హర్షకుమార్ డిమాండ్ చేశారు.

ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్

సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రంజిత్‌కుమార్ బల్‌గోత్ర



పెన్నులు అందుకున్న విద్యార్థినులతో సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రంజిత్‌కుమార్

ముంచంగిపుట్టు: ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ రంజిత్‌కుమార్ బల్‌గోత్ర అన్నారు. సీఆర్‌పీఎఫ్ కమాండెంట్ రాజేష్ పాండే ఆదేశాలతో స్థానిక సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల,బాలుర పాఠశాలలు 1,2లలో 126 మంది 10వ తరగతి విద్యార్థులకు సోమవారం పెన్నులు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ బల్‌గోత్ర మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి అంశాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పదవ తరగతి ఎంతో కీలకమని, మంచి మార్కులు సాధించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ కృష్ణారావు,హెచ్‌ఎంలు లక్ష్మి, ప్రకాశం, మాణిక్యాలరావు, ఉపాధ్యాయులు శ్రీను,తిరుముల, భాగతరాం ,ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా రీ సర్వే పూర్తి



పోర్టల్ వివరాలు తెలుసుకుంటున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

డుంబ్రిగుడ: గడువులోగా రీ సర్వే పూర్తి చేయాలని పాడేరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎం.జె.అభిషేక్ గౌడ ఆదేశించారు. ఆయన సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, రీ సర్వే ఆన్‌లైన్ పోర్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. తమకు న్యాయం చేయాలని ఏకలవ్య పాఠశాల నిర్మాణాలకు భూములిచ్చిన భూ దాతలు జాయింట్ కలెక్టర్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. సబ్‌కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని భూదాతలు గొల్లోరి డొంబు, రామ్‌చందర్ , రాందాసు తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ ముజీబ్ , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాటి పోరాటాలతోనే ఈ ప్రాంతానికి ఖ్యాతి

- పర్యాటక సర్క్యూట్ ఏర్పాటుకు చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్
- 11 మంది గాం గంటందొర వారసులకు ఫ్లాట్లు అందజేత
- లంకవీధిలో పండగ వాతావరణం



భవనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్ , పక్కన ఎన్‌సీసీ చైర్మన్ దుర్గాప్రసాద్,రాజు



ఫ్లాట్ల పత్రాలు పొందిన లబ్ధిదారులు



అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్,పక్కన ఎన్‌సీసీ చైర్మన్ దుర్గాప్రసాద్

కొయ్యూరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, ఆయన అనుచరులు గాం గంటందొర, మల్లుదొర తదితరులు చేసిన పోరాటాలతోనే ఈ ప్రాంతానికి గుర్తింపు లభించిందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. మండలంలోని లంకవీధిలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన రెండు ఎకరాల్లో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ నిర్మించిన రెండు అపార్టుమెంట్లను ప్రారంభించిన అనంతరం, వాటిలోని 11 ఫ్లాట్లను అల్లూరి సీతారామరాజు అనుచరుడు గాం గంటం దొర వారసులకు కలెక్టర్ దినేష్‌కుమార్, ఎన్‌సీసీ చైర్మన్ దుర్గా ప్రసాద్ అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు మరింత చైతన్యవంతులు కావాలని తెలిపారు. ఫ్లాట్లను కేటాయించడమే కాకుండా వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా శిక్షణ ఇచ్చేందుకు ఎన్‌సీసీ ముందుకు రావడం ఆనందంగా ఉందన్నారు. నాటి మన్యం యుద్ధంలో నేలకొరిగిన యోధుల వివరాలను నేటి యువతరానికి తెలియజేసేందుకు పాఠ్య పుస్తకాల్లో చేర్చాల్సి ఉందని చెప్పారు.

జిల్లాలో పలు ప్రాంతాలను కలుపుతూ పర్యాటక సర్క్యూట్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రానున్న రోజుల్లో అన్ని ప్రాంతాలు పర్యాటకంగా మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

రాష్ట్రపతికి ఇచ్చిన మాట నిలుపుకొన్నాం..

ఎన్‌సీసీ చైర్మన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు ఇళ్లు నిర్మిస్తామని 2023 సంవత్సరం జులైలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఇచ్చిన మాటను నిలుపుకొన్నామని చెప్పారు. ఈ భవనాలు వంద సంవత్సరాల వరకు చెక్కుచెదరవన్నారు. అల్లూరి సీతారామరాజు 125 జయంతి సందర్భంగా 2022లో భీమవరంలో నిర్వహించిన ఆజాదికా అమృత్ మహోత్సవం కార్యక్రమంలో ప్రధాని మోదీ చేతుల మీదుగా బోడిదొరతో పాటు కొంతమందిని సన్మానించిన విషయాన్ని గుర్తు చేశారు. ఇక్కడ గిరిజనులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు వీలుగా అవసరమైన ఉపాధి శిక్షణ ఇచ్చేందుకు ఒక ఫ్లాట్‌ను ఉంచామని తెలిపారు.త్వరలో శిక్షణను ప్రారంభిస్తామని ఆయన చెప్పారు.ఎన్‌సీసీ ఈడీ ఎ.జి.కె. రాజు మాట్లాడుతూ ఎన్‌సీసీ సీఎస్‌ఆర్‌లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి తేవడంతో అక్కడి విద్యార్థులు మంచి ప్రతిభ చూపి ఐఐటీలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం గంటందొర వారసులు కలెక్టర్‌ను, ఎన్‌సీసీ చైర్మన్‌ను సన్మానించారు.

అంతకుముందు అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. గంటందొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్‌ను ఎన్‌సీసీ చైర్మన్ తదితరులు సన్మానించగా, వారిని కలెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డి.వి.సూర్యనారాయణ రాజు, క్షత్రియ సేవా సమితికి చెందిన నానిబాబు, తహసీల్దారు ప్రసాద్, జేఈ రామకృష్ణ, ఎంపీడీవో ప్రసాద్,డీటీ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు. ఫ్లాట్లు అందజేయడంతో లంకవీధిలో పండగవాతావరణం నెలకొంది.

డ్రాయింగ్ టీచర్‌కు జాతీయస్థాయి పురస్కారం




అవార్డు అందుకున్న డ్రాయింగ్ టీచర్ కొండబాబు

రాజవొమ్మంగి: స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మిరియాల కొండబాబు జాతీయస్థాయిలో మెరిట్ అవార్డు పొందారు. గుంటూరులోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిర్‌లో జరిగిన కార్యక్రమంలో నిర్వాహకులు కొండబాబుకు అవార్డు అందజేసి, దుశ్శాలువాతో సత్కరించారు. ఇటీవల గుంటూరులో క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో చిత్రకారులకు నిర్వహించిన ఇండియన్ ఆర్ట్ ఫెస్టివల్‌లో ప్రతిభ చూపిన కొండబాబుకు ఈ పురస్కారం లభించినట్టు పాఠశాల హెచ్‌ఎం గోపాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన అభినందన సభలో తాను చిత్రీకరించిన పలు తైలవర్ణ చిత్రాలను కొండబాబు ప్రదర్శించారు. తోటి ఉపాధ్యాయులు కొండబాబును అభినందించారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన అవసరం

- ఏయూ వీసీ ఆచార్య శశిభూషణరావు
- జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు ప్రారంభం



ఆచార్యులతో కలసి ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న వీసీ శశిభూషణరావు

విశాఖ విద్య : యువతరం నూతన సాంకేతికతలపై మెరుగైన అవగాహన కలిగి ఉండాలని ఏయూ వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. సోమవారం వై.వి.ఎస్.మూర్తి ఆడిటోరియంలో జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకల్లో భాగంగా నిర్వహించిన 'అడ్వాన్సెస్ ఇన్ జియో ఫిజిక్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంట్, అండ్ నేచురల్ రిసోర్సెస్' ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇటువంటి సదస్సులు నూతన జ్ఞానాన్ని అందిపుచ్చుకోవడానికి ఎంతో ఉపయోగంగా నిలుస్తాయని చెప్పారు. జియో ఫిజిక్స్ రంగంలో ఆధునిక పరిజ్ఞానాన్ని, సాంకేతికతలను పరస్పరం పంచుకోవడానికి ఈ సదస్సు వేదికగా నిలుస్తుందని చెప్పారు. నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ డైరెక్టర్ ప్రకాష్ చౌహాన్ మాట్లాడుతూ దేశానికి అవసరమైన విలువైన మానవ వనరులను ఏయూ జియో ఫిజిక్స్ విభాగం అందించిందని చెప్పారు. ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై అన్వేషణలు జరగాలని సూచించారు. జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా డీడీ జి.సుజిత్ కుమార్ త్రిపాఠి మాట్లాడుతూ గ్రీన్ హౌస్ గ్యాస్ విడుదల పెరగడం వల్ల ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని చెప్పారు. సుస్థిరమైన భవిష్యత్తుకు, పర్యావరణ సమస్యలకు పరిష్కారాల చూపే విధంగా యువత పనిచేయాలని పిలుపునిచ్చారు. సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, విభాగాధిపతి ఆచార్య సి.వి. నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సదస్సు ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు.

వేతనాలు పెంచాలని అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన | 8లో

క్లుప్తంగా

గ్రావెల్ తరలిస్తున్న మూడు వాహనాల సీజ్



తెల్లకొండ అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న టిప్పర్లు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి సెక్షన్‌లోని తెల్ల కొండ బీటు నుంచి అక్రమంగా మైదాన ప్రాంతానికి గ్రావెల్(ఎర్రమట్టి) తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఒక ప్రొక్లెయినర్‌ను సోమవారం సీజ్ చేసినట్టు ఎఫ్ఎస్‌వో రాము తెలిపారు. శనివారం నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతం నుంచి సుమారు 30 ట్రిప్పుల మట్టి తరలించినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నామని చెప్పారు. కాగా అటవీ అధికారులను చూసి వాహనాలు నడుపుతున్న కొంత మంది అక్కడ నుంచి పరారైనట్టు ఆయన తెలిపారు. దీంతో 12 మంది అటవీ అధికారులు చీకటి పడిన తరువాత కూడా ఆ వాహనాల వద్ద కాపలా ఉన్నారు.

నేడు, రేపు ఐటీడీఏల్లో కలెక్టర్ సమావేశాలు

సాక్షి,పాడేరు: కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ రెండు రోజుల పాటు రంపచోడవరం,చింతూరు ఐటీడీఏల్లో అధికారులతో సమావేశాలు నిర్వహించనున్నారు. మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ కార్యాలయంలో, బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నారు.పోలవరం ముంపు గ్రామాల్లో భూసేకరణ,ఆర్అండ్ఆర్ ప్యాకేజీ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షలు జరపనున్నారు.

విశాఖ జిల్లాకు చేరుకున్న బ్యాలెట్ పత్రాలు



ఎమ్మెల్సీ బ్యాలెట్ పత్రాలను పరిశీలిస్తున్న ఏఆర్వో భవానీ శంకర్

మహారాణిపేట(విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానం ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ పత్రాలు జిల్లాకు చేరుకున్నాయి. ఓటర్లు, పోలింగ్ కేంద్రాలు, పోటీ చేసే అభ్యర్థుల ఫొటోలు, ఇతర వివరాలను ఇక్కడి నుంచి అధికారులు పంపించగా, సంబంధిత బ్యాలెట్ పత్రాలను కర్నూలులో ప్రింటింగ్ చేశారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో సోమవారం కలెక్టరేట్‌కు తీసుకొచ్చారు. 10 శాతం రిజర్వ్‌తో కలిపి జిల్లాలోని పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల సంఖ్యకు సరిపడా పత్రాలను అధికారులు సేకరించి భద్రపరిచారు. ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బి.హెచ్. భవానీ శంకర్ ఈ ప్రక్రియను దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం సంబంధిత వాహనానికి పోలీసులు, ఇతర లైజనింగ్ అధికారుల సమక్షంలో సీలు వేసి ఉత్తరాంధ్ర జిల్లాలకు పంపించేశారు.

అధికారులు, ప్రజా ప్రతినిధుల మధ్య సమన్వయం అవసరం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ తనూజారాణి



సర్వసభ్య సమావేశానికి హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు

- వేసవిలో తాగునీటి సమస్య రానీయొద్దు
- అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజా రాణి

అనంతగిరి(అరకులోయ టౌన్): అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అరకులోయ ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజా రాణి కోరారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన సోమవారం జరిగిన అనంతగిరి మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కిషోర బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. మండల, గ్రామ పంచాయతీల స్థాయిలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో జరిగే అభివృద్ధి పనులను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు తెలియకుండా ఎలా చేస్తారని అధికారులను ఆమె ప్రశ్నించారు. ఎస్ఎంఐ ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో వివిధ పీహెచ్‌సీలలో ఉన్న అంబులెన్స్‌లు మరమ్మతులకు గురయ్యాయని, కొత్త అంబులెన్స్‌లు మంజూరు చేయాలని ఎంపీపీ, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు కోరాగా.. ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ మండలంలోని కుడియా, చిట్టంపాడు, గుజ్జెలి గ్రామాలలో హైడ్రో పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు కేబినెట్ ఆమోదంపై గిరిజనులు ఆందోళన చెందుతున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాలన్నారు. సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని ఎంపీ హామీ ఇచ్చారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేసేందుకు నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆ పనులు త్వరితగతిన పూర్తి చేసి తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మండలంలో ఇసుకను తక్కువ ధరకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని జెడ్పీటీసీ దీసరి గంగరాజు కోరారు. లారీ యజమానులతో చర్చించి తక్కువ ధరకు ఇసుకు సరఫరా చేసేలా చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌కు ఎంపీ సూచించారు. మండల సర్వసభ్య సమావేశాలకు కింది స్థాయి అధికారులు కాకుండా మండల స్థాయి అధికారులు పాల్గొనాలని పాలకవర్గం సభ్యులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వి.మాణిక్యం, ఏఈఈలు గౌతమ్, గణేష్, సీడీపీవో సంతోష్ కుమారి, ఎంఈవో కె.బాలాజీ, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ, వైద్యాధికారులు జ్ఞానేశ్వరి, మంజు భార్గవి, ఏపీవో సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ శకుంతల, ఎంపీటీసీలు టి.మితుల, శిరగం అశోక్ కుమార్, తాటి నాయుడు, ఎం.సన్యాసిరావు, వెంకటరామలక్ష్మి, శోభ తిరుపతమ్మ, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, సర్పంచ్‌లు రూతు, పాగి అప్పారావు, జన్ని అప్పారావు, కిల్లో మొష్యా, తదితరులు పాల్గొన్నారు. ఎంపీగా ఎన్నికై మొట్టమొదటి సారిగా మండలానికి విచ్చేసిన ఎంపీ తనూజారాణిని ఎంపీపీ శెట్టి నీలవేణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొర్రా సూర్యనారాయణ, అరకు నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మాజీ జెడ్పీటీసీ గంగన్నదొర, పార్టీ నాయకులు సన్మానించారు.

చదువుతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



బూసిగూడెం ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

- రక్తహీనతపై ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు
- అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం
- బూసిగూడెం ఆశ్రమ పాఠశాల సందర్శన

రంపచోడవరం: ఏజెన్సీలోని ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండలంలో బూసిగూడెం గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను సోమవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి భోజనం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రక్తహీనతకు గురికాకుండా మంచి ఆహారం అందజేయాలన్నారు. సికిల్ సెల్ ఎనిమియా బాధితులు ఎంత మంది ఉన్నారు, రక్తహీనత లేకుండా ఎప్పకప్పుడు వైద్య పరీక్షలు చేయించి ఏ స్టేజిలో ఉందో తెలుసుకుని రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. మెనూ అమలుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడి చదువు ఎలా చెబుతున్నదీ ఆరా తీశారు. విద్యార్థులను గ్రేడ్‌లుగా విభజించి చదువులో వెనుకబడిన వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించాలన్నారు. పీవో కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, డీడీ విజయశాంతి, ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఈఈ ఐ.శ్రీనివాసరావు, తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర, తదితరులు పాల్గొన్నారు.

మయూరి హిల్ రిసార్ట్స్ హౌస్ కీపర్ హఠాన్మరణం



లలిత్ మృతదేహంతో మయూరి హిల్ రిసార్ట్స్ ఎదుట నిరసన తెలుపుతున్న కుటుంబ సభ్యులు, కార్మికులు

- మృతదేహంతో కుటుంబీకులు, గిరిజన సంఘాలు ఆందోళన
- రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్
- డీబీఎం, తహసీల్దార్‌తో కార్మికులు జరిపిన చర్చలు విఫలం



కార్మికులు, కుటుంబ సభ్యులతో చర్చిస్తున్న డీబీఎం జగదీష్, తహసీల్దార్, తదితరులు



పూజారి లలిత్(ఫైల్)

అరకులోయ టౌన్: ఏపీ టూరిజం అరకులోయ మయూరి హిల్ రిసార్ట్స్‌లో హౌస్ కీపర్‌గా పని చేస్తున్న పూజారి లలిత్(45) సోమవారం హఠాత్తుగా మృతి చెందారు. రిసార్ట్స్ ప్రాంగణంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేస్తూ కళ్లు తిరిగి కింద పడిపోయిన ఆయనను సహచర సిబ్బంది హుటాహుటిన అరకు ఏరియా ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. 2007 నుంచి పర్యాటక శాఖలో లలిత్ పని చేస్తున్నారు. మృతుడికి భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న టూరిజం శాఖ డివిజినల్ బ్రాంచి మేనేజర్ జగదీష్ హుటాహుటిన అరకులోయకు చేరుకొని ఏరియా ఆస్పత్రికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతికి గల కారణాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి రూ. 2 లక్షలు ఇన్సూరెన్స్ ఇస్తామని టూరిజం డీబీఎం చెప్పడంతో అంగీకరించని కటుంబ సభ్యులు, గిరిజన సంఘాల నాయకులు, యూనియన్ ప్రతినిధులు ఆస్పత్రి నుంచి మృతదేహాన్ని మయూరి హిల్ రిసార్ట్స్‌కు తీసుకొచ్చి ఆందోళనకు దిగారు. దీంతో అరకులోయ తహసీల్దార్ ఎంవీవీ ప్రసాద్, డీబీఎం జగదీష్, గిరిజన సంఘం, టూరిజం కార్మికులతో చర్చలు జరిపారు. నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ టూరిజం అధికారుల నుంచి సరైన స్పందన రాలేదు. రాత్రి 9 గంటల వరకు మృతదేహంతో మయూరి హిల్ రిసార్ట్ వద్దే నిరసన తెలిపారు. తమకు న్యాయం జరిగితే తప్పా మృతదేహాన్ని తీసుకెళ్లే ప్రసక్తి లేదని కార్మికులు, గిరిజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు. మృతుడి కుటుంబానికి రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆందోళనలో వైఎస్సార్‌సీపీ నాయకులు కమిడి అశోక్, పరశురాం, స్వాభి రామమూర్తి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పాద్దు బాలదేవ్, తదితరులు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని అంగన్‌వాడీల ఆందోళన



చింతూరు ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ముంచంగిపట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజరుకు వినతి పత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

చింతూరు: వేతనాలు పెంచాలని, మినీ సెంట ర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కేంద్రం వద్ద అంగన్‌వాడీ వర్కర్లు ఆందోళన నిర్వహించారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నిర్వహించిన ఈ ఆందోళనలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడు తూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ వర్కర్లు ఎన్నో సేవలందిస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రమోషన్ల కోసం నిబంధనలను రూపొందించాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ల పోస్టులను వెంటనే భర్తీ చేయా లని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నూకరత్నం, వసంత, పార్వతి, సుక్కమ్మ, లలిత పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో

రాజవొమ్మంగి: తమ సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం ఆందోళన చేశారు. సీఐటీయూ నేతల ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి, ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామరాజు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల హామీలను నెరవేర్చాలి

ముంచంగిపుట్టు: అంగన్‌వాడీలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీఐటీయూ మండల కార్యదర్శి కె.శంకరరావు అన్నారు. ముంచంగిపుట్టులోని ఐసీడీఎస్ కార్యాలయం సూపర్‌వైజర్లకు సోమవారం సోమవారం సీఐటీయూ నేతలు, అంగన్‌వాడీలు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచి, సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నెలలు గడుస్తున్నా నేటికీ అతీగతీ లేదన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేని పక్షన ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు.

మాపై ఎందుకీ కక్ష?

- ఏయూలో పీహెచ్‌డీ స్కాలర్స్ నిరసన గళం
- పరీక్షలు ఎందుకు రద్దు చేశారో చెప్పాలి
- వైస్ చాన్సలర్ భవనం ముందు ఆందోళన



మాట్లాడుతున్న పరిశోధన విద్యార్థిని

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీలో పరిశోధక విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. ఏయూలో పీహెచ్‌డీ ప్రవేశాలు పొందిన ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 60 మందికి పైగా పరిశోధక విద్యార్థులు వీసీ భవనం ముందు గాంధీజీ, అంబేద్కర్ విగ్రహాల వద్ద సోమవారం నిరసనకు దిగారు. వైవా, ప్రీ-పీహెచ్‌డీ పరీక్షలు వెంటనే నిర్వహించాలని ప్లకార్డులు, ఫ్లెక్సీలు చేత పట్టుకుని 'వుయ్ వాంట్ జస్టిస్' అంటూ నినాదాలు చేశారు. 2019 నుంచి 2023 వరకు ఏపీఆర్ సెట్ ద్వారా చేరిన వారికి అకారణంగా పరీక్షలు నిలిపివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రీ-టాక్ పూర్తి చేసుకున్న వారికి వెంటనే అవార్డులు అందజేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశోధక విద్యార్థులతో చర్చించారు. ఆందోళన విరమించాలని కోరారు. అయితే, తమకు వర్సిటీ అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చేంత వరకు ఇక్కడి నుంచి వెళ్లేది లేదని తెగేసి చెప్పారు. దీంతో పోలీసులు విద్యార్థుల డిమాండ్లను వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

పరీక్షల నిర్వహణకు వీసీ హామీ : టీడీఆర్-హబ్ డీన్ ఆచార్య మల్లికార్జునరావు నిరసనకు దిగిన విద్యార్థుల వద్దకు వచ్చి చర్చించారు. పీహెచ్‌డీ స్కాలర్స్‌కు త్వరలోనే పరీక్షలు నిర్వహించి, అవార్డులు ప్రదానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఇదే విషయాన్ని వైస్ చాన్సలర్ చెప్పాలని పీహెచ్‌డీ స్కాలర్స్ పట్టుబట్టారు. దీంతో ఆయన పీహెచ్‌డీ స్కాలర్స్ జేఏసీ ప్రతినిధులను వీసీ శశిభూషణరావు వద్దకు తీసుకువెళ్లారు. ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయిలో సమీక్ష జరిగిందని, త్వరలోనే ఏర్పాట్లు చేస్తామని వీసీ హామీ ఇచ్చినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు.

వర్సిటీ అధికారుల తీరు మారాల్సిందే : టీడీఆర్-హబ్ ద్వారా జరిగిన పీహెచ్‌డీ ప్రవేశాలపై ఏమైనా అనుమానాలు ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవచ్చని.. కానీ తమపై కక్ష గట్టినట్టుగా పరీక్షలు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని పరిశోధక విద్యార్థులు అన్నారు. నిరసన విరమించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. వర్సిటీ అధికారుల తీరు మారాల్సిన అవసరం ఉందన్నారు. ఏపీఆర్ సెట్ రాసి, మెరుగైన ర్యాంకులు సాధించి వర్సిటీలో పీహెచ్‌డీ చేద్దామని ఇక్కడికి వస్తే.. అధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు తమను బాధపెట్టాయన్నారు. తక్షణమే ప్రీ-పీహెచ్‌డీ, వైవా పరీక్షలు నిర్వహించాలని, ప్రీ-టాక్ పూర్తయిన వారికి అవార్డులు ప్రదానం చేయాలని డిమాండ్ చేశారు.

సెయింటాన్స్ ఘటనపై కలెక్టర్ సీరియస్

- సమగ్ర విచారణ జరపాలని డీఈవోకు ఆదేశం
- పాఠశాల, హాస్టల్‌ను పరిశీలించిన బ్రహ్మాజీరావు
- హాస్టల్ వార్డెన్‌పై వేటు
- దాడికి పాల్పడిన ముగ్గురు విద్యార్థినులు వసతి గృహం నుంచి తొలగింపు

పాడేరు: పట్టణంలోని సెయింటాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థినిపై పదో తరగతి విద్యార్థినులు దాడి చేసిన ఘటనపై కలెక్టర్ దినేష్‌కుమార్ సీరియస్ అయ్యారు. సోమవారం దినపత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి నివేదిక అందజేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావును ఆదేశించారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీను ఏర్పాటు చేశారు. దీంతో డీఈవో సోమవారం పాఠశాల, వసతి గృహాన్ని సందర్శించారు. సంఘటన వివరాలను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ నిర్వహణకు అనుమతులు ఉన్నాయా లేదా అనే అంశంపై ఆరా తీశారు. నివేదిక ఆధారంగా వసతి గృహ కేర్ టేకర్ శ్రావ్యను విధుల నుంచి తొలగించారు. ఘటనకు బాధ్యులైన ముగ్గురు టెన్త్ విద్యార్థినులను హాస్టల్ నుంచి ఇళ్లకు పంపించివేశారు. వసతి గృహ నిర్వాహణపై నిత్యం పర్యవేక్షణ జరపాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇకపై ఇటువంటి ఘటనలు, వివాదాలు జరిగితే పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని డీఈవో హెచ్చరించారు.

రిజర్వ్ బ్యాంక్ పేరుతో మోసాలు

- ముగ్గురు ముఠా సభ్యుల అరెస్ట్
- పరారీలో ప్రధాన నిందితుడు



పోలీసుల అదుపులో ఉన్న లక్ష్మీ ప్రసన్న, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు

గోపాలపట్నం(విశాఖ): రిజర్వ్ బ్యాంక్ ద్వారా కోట్లాది రూపాయలు, విల్లాలు ఇప్పిస్తామని.. రూ.5 వేలు కడితే కోటి వరకు నజరానా వస్తుందని నమ్మించి మోసాలకు పాల్పడుతున్న ముఠా సభ్యులను సోమవారం టాస్క్‌ఫోర్స్, ఎయిర్‌పోర్టు పోలీసులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివి.. రెండు రాష్ట్రాల్లో ఓ ముఠా రైస్ పుల్లింగ్, రిజర్వ్ బ్యాంక్ సర్టిఫికెట్లు వంటి పలు రకాల మోసాలకు పాల్పడుతోంది. ఇందులో కొందరు ముఠా సభ్యులు విశాఖలో ఉన్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు మర్రిపాలెం వుడా లేఅవుట్ పార్క్ సమీపంలో ఒక ఇంటిపై దాడి చేశారు. విశాఖకు చెందిన లక్ష్మీ ప్రసన్న, కోటేశ్వరరావు, కాకినాడకు చెందిన శ్రీనివాసలను అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ప్రధాన నిందితుడైన యడ్లపల్లి నారాయణ మూర్తి పరారయ్యాడు. వీరు గతంలో పలు చోట్ల దొంగ నోట్లు చలామణి చేయడం, రూ.5వేలు, రూ.10 వేలు కడితే కోట్ల రూపాయలు వస్తాయని నమ్మించి మోసాలకు పాల్పడ్డారు.

వీరు విశాఖ, రాజమండ్రి, కాకినాడ ప్రాంతాలను అడ్డాగా మార్చుకుని ప్రజలను ఏమార్చుతున్నారు. కాగా.. టాస్క్‌ఫోర్స్ పోలీసులు నిందితులను ఎయిర్‌పోర్టు పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎయిర్‌పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ముఠా బారిన పడిన బాధితులు ఎంతమంది ఉన్నారనే దానిపై ఆరా తీస్తున్నారు. బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు.

కేర్ ఆస్పత్రిలో రోగి మృతిపై ఆందోళన

- మృతదేహం ఇచ్చేందుకు రూ.5 లక్షల డిమాండ్

ఆరిలోవ(విశాఖ): హెల్త్‌సిటీలోని కేర్ ఆస్పత్రిలో ఒక రోగి మృతి చెందడం ఆందోళనకు దారి తీసింది. ఆస్పత్రి యాజమాన్యం మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5లక్షలు డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబ సభ్యులు నిరసనకు దిగారు. మృతుడి బంధువులు తెలిపిన వివరాలివి.. చోడవరానికి చెందిన బండి శ్రీధర్ (55) గుండెనొప్పితో బాధపడుతుండగా, ఆదివారం సాయంత్రం 6.30 గంటలకు కుటుంబ సభ్యులు హెల్త్ సిటీలోని కేర్ ఆస్పత్రిలో చేర్పించారు. అతనికి అత్యవసరంగా గుండె శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు చెప్పడంతో కుటుంబ సభ్యులు అంగీకరించారు. ముందుగా ఆస్పత్రికి రూ.60 వేలు చెల్లించారు. అర్ధరాత్రి 12.30 నుంచి ఒంటి గంట మధ్య సమయంలో ఐసీయూలో ఉన్న శ్రీధర్‌ను చూడటానికి కుటుంబ సభ్యులు వెళ్లగా.. అతను మృతి చెందినట్లు గుర్తించారు. వైద్యులను సంప్రదించగా వారు పరిశీలించి శ్రీధర్ మరణించినట్లు నిర్ధారించారు. శ్రీధర్‌కు రెండు శస్త్రచికిత్సలు చేశామని, వాటికి సంబంధించిన ఫీజు చెల్లించాలని వైద్యులు సూచించారు. మృతదేహాన్ని అప్పగించడానికి రూ.5 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో ఆగ్రహించిన శ్రీధర్ కుమారులు 'గుండె జబ్బు నయం చేస్తామని చెప్పి మా నాన్నను చంపేశారు' అంటూ వైద్యులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం బంధువులకు తెలియడంతో చోడవరం నుంచి సోమవారం ఉదయం ఆస్పత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. మృతదేహం కోసం డబ్బులు చెల్లించమని, వెంటనే మృతదేహాన్ని తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ సమాచారం అందుకున్న ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు, ఎస్ఐ కృష్ణ సిబ్బందితో కలిసి కేర్ ఆస్పత్రికి చేరుకున్నారు. బాధితులు, ఆస్పత్రి యాజమాన్యంతో చర్చలు జరిపారు. ముందు చెల్లించిన రూ.60వేలతో పాటు అదనంగా రూ.1.10 లక్షలు చెల్లించి మృతదేహాన్ని తీసుకువెళ్లడానికి బంధువులు అంగీకరించారని ఆస్పత్రి వైద్యులు తెలిపారు. దీంతో ఆందోళన సద్దుమణిగింది. శస్త్రచికిత్స చేసే సమయంలో అంగీకార పత్రంపై సంతకాలు తీసుకున్నట్లు వైద్యులు తెలిపారు.

‘ఉక్కు’ మహిళా ఉద్యోగులకు అవార్డులు



అవార్డులతో సుజాత, రేష్మా సుల్తానా

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగు లు డాక్టర్ జి.సుజాత, రేష్మా సుల్తానాలకు జాతీయస్థాయి అవార్డులు లభించాయి. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో ఆది, సోమవారాల్లో జరిగిన 35వ జాతీయ ప్రభుత్వ రంగ మహిళా ఫోరం(విప్స్) సమావేశాల్లో స్టాండింగ్ కాన్ఫరెన్స్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ (స్కోప్) డైరెక్టర్ జనరల్, ఐఎల్‌వో పాలకమండలి సభ్యురాలు అతుల్ సోబ్తీ చేతులమీదుగా వీరు అవార్డులు స్వీకరించారు. ఉక్కు జనరల్ ఆస్పత్రిలో గైనకాలజీ చీఫ్ స్పెషలిస్ట్ డాక్టర్ జి.సుజాత చేసిన పరిశోధనలు, సేవలను గుర్తించి ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డుకు ఎంపిక చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు చెందిన మాధారం మైన్స్‌లో ల్యాబ్ టెక్నీషియన్ రేష్మా సుల్తానా ఫార్మసీ కార్యకలాపాలు నిర్వహించడంలో చేసిన సేవలను గుర్తించి నాన్ ఎగ్జిక్యూటివ్ కేటగిరీలో ఉత్తమ ఉద్యోగిగా జాతీయ స్థాయి అవార్డు అందజేశారు. అలాగే స్టీల్‌ప్లాంట్ వుమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్)కు 'స్పెషల్ పార్టిసిపేషన్' అవార్డు లభించింది.